www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | మంగళవారం 18,ఆగస్టు, 2026

## ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం



భద్రత న్యూస్ ములుగు

ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలని, మండల ప్రజావాణి కి వచ్చిన ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం తెలియజేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని,అత్యవసర సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని,ప్రజలను సమస్యలను పరిష్కరించడంలో అధికారులు కాలయాపన చేయకూడదని సూచించారు.ఒంటరి మహిళలు, వితంతువుల,వికలాంగుల పింఛన్ దరఖాస్తులను 31లోగా స్వీకరించాలని,స్థానిక అధికారులు మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని,అధికారులు చిత్తశుద్ధితో విధులు..

గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలి

ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి

అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించాలి

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలి

ఒంటరి మహిళలు, వితంతువుల పింఛన్ దరఖాస్తులను 31లోగా స్వీకరించాలి

మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి

అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క

2 లో..



## ఆర్ఎంపీల హైడోస్!

2 లో..

- అర్హతలేని వైద్యం.. ప్రాణ సంకటం!
- ఆసుపత్రులను తలపించేలా క్లినిక్ నిర్వహణ?
- జ్వరాల సీజన్లో ఆర్ఎంపి లతో జాగ్రత్త
- ఆర్ఎంపీలపై భద్రాద్రి న్యూస్ ప్రత్యేక కథనం..

జులూరుపాడు,చంద్రుగొండ(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి : ఇవాల్టికి మూడు రోజులయ్యింది... దగ్గు,జ్వరం తగ్గుతనే లేదు మా కొడుకు తెచ్చిన గోలీలను వేసుకుంటున్న ఏం తేడా కనబడటం లేదు.ఇక రేపు కొత్తగూడెం కానీ చంద్రుగొండ కానీ దావఖానాలో చూపించకు0ట అంటున్న నరసయ్య దగ్గుకుంటూ చెబుతుండగానే... అరే నరసన్న కొత్తగూడెం దాకా ఎందుకు మనోళ్లే డాక్టర్లే రెండు సూదులు గుచ్చితే చాలు నీ దగ్గు నీ జరం అన్ని పోతాయి. పో అని రమేష్ చెప్పాడు. నరసయ్య ఊర్లో ఆర్ఎంపీ ..

## ప్రత్యేక సమగ్ర సవరణ-2026లో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ



8లో

109-ములుగు నియోజకవర్గంలో 2,09,128 మంది ఓటర్లు

సెప్టెంబర్ 16 వరకు దావాలు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం

ఫారం-6, 7, 8 ద్వారా దరఖాస్తులకు అవకాశం

బీఎల్ఓలతో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు సమర్పించవచ్చు

ప్రతి ఓటరూ జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలి

: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు

భద్రాద్రి న్యూస్

మంగళవారం 18,ఆగస్టు, 2026

# ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించాలని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలు, హైదరాబాద్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే గ్రీవెన్స్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఐసోమవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తులను క్రమపద్ధతిలో స్వీకరించాలని, స్థానికంగా పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను సంబంధిత జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించి వాటిపై సమాధానం తెప్పించి దరఖాస్తుదారులకు తెలియజేయాలని అన్నారు.

గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారుడి సెల్‌ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలన్నారు. సమస్య పరిష్కారానికి ఎంత సమయం పడుతుందో ముందుగానే తెలియజేయడంతో పాటు, నిర్ణీత సమయంలో దరఖాస్తు పరిష్కారమైందా లేదా, పరిష్కారం కాకపోతే కారణం ఏమిటనే విషయాన్ని సంబంధిత వ్యక్తికి స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు.

అత్యవసర సమస్యల విషయంలో అధికారులు వెంటనే స్పందించి చర్యలు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలకు అవసరమైన సమయాన్ని అంచనా వేసి, కనీసం వారం రోజుల్లో దరఖాస్తుదారులకు పురోగతిపై సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు ఒకే సమస్య కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదన్నారు.

మండలాల వారీగా గ్రీవెన్స్ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడం



ద్వారా జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజల సంఖ్య తగ్గడంతో పాటు స్థానికంగానే సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అధికారులు విధులను బాధ్యతగా, చిత్తశుద్ధితో నిర్వహించి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కార దిశగా పరిశీలించాలని సూచించారు.

ఒంటరి మహిళలు, వితంతువులకు, సంబంధించిన పింఛన్ దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా అన్ని గ్రామాల నుంచి పూర్తిస్థాయిలో స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హుల పింఛన్లకు ప్రభుత్వం దశలవారీగా చర్యలు చేపడుతోందని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోలేదనే పరిస్థితి తలెత్తకుండా ఎంపీడీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాలు, అంతర్గత వాడలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలన్నారు. పస్రా, గోవిందరావుపేట, చల్వాయి తదితర ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని, ఎస్టీ తండాలు, గూడేల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సుమారు రూ.50 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అంతర్గత, సీసీ రహదారుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, తహసిల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీవో వరుణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## భూ రీ-సర్వేతో భూ వివాదాలకు చెక్..భూ రీ-సర్వేతో భూ వివాదాలకు చెక్



**ఎడ్జర్లపల్లి లో అధికారుల కదలిక??**

**హద్దులు తేల్చి.. రికార్డులు పక్కా చేసి.. రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం**

**పారదర్శక రీ-సర్వేకు రైతుల సహకారం తప్పనిసరి: అధికారుల సూచన**

**వాజేడు ఆగస్టు 17 (భద్రాద్రి న్యూస్):**

ఏళ్ల తరబడి రైతులను వేధిస్తున్న భూ హద్దుల వివాదాలు, విస్తీర్ణంలో తేడాలు, రికార్డుల్లో లోపాలకు ఇక చెక్ పెట్టే దిశగా అధికారులు కదిలారు. ఎడ్జర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వ్యవసాయ భూముల రీ-సర్వేపై సోమవారం గ్రామసభ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. భూముల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులను పక్కాగా రూపొందించడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా చేయడమే రీ-సర్వే ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

**ఏళ్ల నాటి సమస్యలకు తెరపడేనా?**

భూమి హద్దులు ఎక్కడ మొదలై ఎక్కడ ముగుస్తాయో తేలకపోవడం, రికార్డుల్లో విస్తీర్ణం-క్షేత్రస్థాయి భూమి మధ్య తేడాలు ఉండటం, పాత పత్రాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులకు రీ-సర్వే ద్వారా పరిష్కారం లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రతి భూమికి సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, అందుబాటులో ఉన్న రికార్డులను సమగ్రంగా పరిశీలించి నమోదు చేయనున్నట్లు వెల్లడించారు.

**పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి**

రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అందుబాటులో ఉన్న రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. సర్వే సమయంలో అధికారులు అడిగే వివరాలను అందించి, క్షేత్రస్థాయిలో కొలతలు నిర్వహించే సమయంలో పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.



**రైతుల గోడు అధికారుల ముందుకు**

గ్రామసభలో పలువురు రైతులు తమకు ఎదురవుతున్న భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హద్దుల విషయంలో ఉన్న అనుమానాలు, రికార్డులకు సంబంధించిన సమస్యలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

**పారదర్శకత లేకుంటే మళ్లీ అదే సమస్యలు!**

రీ-సర్వే పేరుతో కేవలం కొలతలు తీసుకోవడం కాకుండా ప్రతి రైతుకు సంబంధించిన భూమి వివరాలు కచ్చితంగా నమోదు కావాలని గ్రామస్థులు కోరారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు, పక్షపాతానికి తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క తప్పు నమోదు భవిష్యత్తులో మరో వివాదానికి దారితీయకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**అధికారులు-రైతులు సమన్వయంతోనే సమస్యలకు శాశ్వత చెక్**

రీ-సర్వే విజయవంతం కావాలంటే అధికారులు ఒకవైపు కచ్చితత్వంతో పనిచేయడంతో పాటు, రైతులు మరోవైపు తమ భూములకు సంబంధించిన సరైన పత్రాలు, వివరాలు అందించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు. భూమి హక్కులకు భద్రత.. రికార్డులకు పక్కా ప్రామాణికత.. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దిశగా రీ-సర్వే సాగాలని ప్రజలు ఆకాంక్షించారు. గ్రామసభలో గ్రామ సర్పంచ్ అట్టం మమత, తహసీల్దార్ శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి చందులాల్, గ్రామ పరిపాలన అధికారి జి. శంకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి నరీన్ కుమార్ పాల్గొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి వివాదాలకు తావులేకుండా పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇకనైనా భూముల హద్దులు తేలాలి.. రికార్డులు పక్కా కావాలి.. రైతుల భూ సమస్యలకు శాశ్వతంగా తెరపడాలి అని వారు అభిప్రాయపడ్డారు.

# ఆర్ఎంపీల హైడోస్!

**మొదటి పేజీ తరువాయి**

దగ్గర ట్రీట్మెంట్ తీసుకున్నాడు. రమేష్ చెప్పినట్లే రెండు రోజుల్లో నరసయ్య దగ్గు, జ్వరం వంటి నొప్పులు అన్ని తగ్గిపోయాయి.ఇది ఎలా సాధ్యమని కాస్త చదువుకున్న నరసయ్య కొడుకు ఆరా తీస్తే ఆర్ఎంపి ఇచ్చినవి అధిక డోసు మందులు పేషెంట్ కు భవిష్యత్తులో ఇబ్బంది ఎదురవుతుందని తెలిసినా... ఇలా చాలామంది అర్హత లేని ఆర్ఎంపీలు యాంటీబయటిక్, స్టెరాయిడ్స్ ఇస్తున్నారు. ఇవేవీ తెలియని వారి వైద్యాన్ని గుడ్డిగా నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

తెలంగాణ క్లినిక్ ఎస్టాబ్లిష్మెంట్ రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్ యాక్టివ్ 2010 ప్రకారం రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్లు గ్రామాల్లో అత్యవసర సమయాల్లో ప్రాథమిక చికిత్స అందించడానికి మాత్రమే అర్హులు. వారి ప్రధాన విధి ఫస్ట్ ఎయిడ్ చేసి రోగిని సమీప ఆస్పత్రికి తరలించడం.తమ క్లినిక్లను ఆసుపత్రులు నర్సింగ్ హోమ్లు, లేదా మెడికల్ హాలుగా పేర్కొనడం పేరు ముందు డాక్టర్ ఉపయోగించడం ఇన్ పేషంట్లను చేర్చుకోవడం నిషేధం. అయితే కొందరు ఆర్ఎంపీలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ చిన్నపాటి ఆసుపత్రులను నడుపుతున్నారు. ఇటువంటి వారిపై దాడులు చేసి బయటపెట్టాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు..

**- అనహారత వైద్యంతో ప్రమాదం..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు జూలూరుపాడు,చంద్రుగొండ మండలంలో కొందరు ఆర్ఎంపీలు తమ అనహరతలను మీరి వైద్యం చేస్తున్నారు. ఎంబిబిఎస్,ఎండి, ఎంఎస్, గైనకాలజిస్ట్, కార్డియాలజిస్ట్ స్థాయిలో మందులు రాస్తూ రక్తపోటు మధు మోహం మాత్రలు సూచిస్తున్నారు. అదేవిధంగా కొందరు ఆర్ఎంపీలు సంతానం లేని చికిత్సలు మగ పిల్లల జననం కోసం మందులు ఇస్తున్నారని సమాచారం? జోరుగా వినిపిస్తుంది. దీనిపై జిల్లాకు సంబంధించిన అధికారి మండలంలో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు..

**- జాగ్రత్త సుమా..**

ప్రస్తుతం వైరల్ జ్వరాలు,జలుబు, దగ్గుబట్టి వ్యాధులు సర్వసాధనంగా కనిపిస్తున్నాయి.ఈ సీజన్లో కొందరు ఆర్ఎంపీల వద్ద మండల కేంద్రంలోని ప్రముఖ ఆసుపత్రులకు సమానమైన రద్దీ కనిపిస్తుంది మోతాదుకు మించి మందులు ఇవ్వడం వల్ల రోగులు త్వరగా తగ్గినట్లు కనిపించిన దీర్ఘకాలంలో అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇది స్థానికులను ఆర్ఎంపీల వైపు ఆకర్షించుకున్నప్పటికీ దీర్ఘకాల పరిమణాలను వారు గుర్తించడం లేదు. ప్రజలు అరత లేని ఆర్ఎంపీల వద్ద చికిత్సలు తీసుకోకుండా ధ్రువీకరణ పొందిన వైద్యులను ఆశ్రయించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చికిత్స అందించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు..

భద్రాద్రి న్యూస్
మంగళవారం 18,ఆగస్టు, 2026

# ఉద్దిపకము-3 పుస్తకాలు పంపిణీ



**భద్రాద్రి న్యూస్ బూర్గంపాడు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలోని AGHS బూర్గంపహాడ్ బాలికల పాఠశాల నందు ఉద్దిపకము -3 పుస్తకాలను పంపిణీ చేశారు. లిబూర్గంపహాడ్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మందా నాగరాజులిచేతుల మీదుగా విద్యార్థులకు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ లోకి 50 మంది ఆటో కార్మికులు చేరిక..!!

**ఏఐటీయూసీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కంచర్ల జమలయ్య**









**జూలూరుపాడు/చండ్రుగొండ(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి :**

టియుసిఐ నుంచి ఏఐటీయూసీ పోరాటాలకు ఆకర్షితులై 50 మంది ఆటో కార్మికులు ఏఐటీయూసీలోకి చేరారు సోమవారం వారికి ఏఐటియుసి (ఆటో వర్కర్స్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య కండువా కప్పి వారిని ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం మండల కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ఆటో కార్మికులు నష్టపోతున్నారని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి కాలం గడుపుతున్నారని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న అమలు చేయటంలో పూర్తిగా వైఫల్యం చెందారని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఆటో కార్మికులకు ఆటో స్టాండ్లు లను ఏర్పాటు చేయాలని అర్హులైన ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు ఎస్సీ ఎస్టీ బీసీ కార్పొరేషన్ల ద్వారా ఆటోలు ముంజూరు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కంచర్ల రాఘవేంద్రరావు,వలమల సామేలు గార్లపాటి వీరభద్రం యాసా రోశయ్య సిరిపురపు వెంకటేశ్వర్లు ఏఐటీయూసీ మండల అధ్యక్షులు గార్లపాటి శివకృష్ణ కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ అబ్బులు దేశి తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు మేనమామ కెసిఆర్





**-ఎంతో మందికి పెళ్లి చేసిన నాయకుడు**

**మాజీ MLA మెచ్చా**

**భద్రాద్రి న్యూస్ దమ్మపేట**

కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కళ్యాణ లక్ష్మీ ,షాది ముబారక్ పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ బి ఆర్ యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలమేరకు సోమవారం దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట లిఅశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నిరసన చేపట్టారు.డిమాండ్లతో కూడిన మెమోరాండం డిప్యూటీ తహశీల్దార్ గారికి అందజేశారు. ఈ సందర్భంగా మెచ్చా గారు మాట్లాడుతూ దోచుకోవడం దా చుకోవడమే పనిగా ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేలవరకు పెట్టుకున్నారని.ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కోట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో ఒక మేనమామలా కెసిఆర్ గారు కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి ఎంతోమందికి ఆర్థికంగా సహాయపడ్డారని.2023 ఎన్నికల సమయంలో కెసిఆర్ గారు కేవలం లక్ష మాత్రమే ఇస్తున్నారు నేను గెలిచిన రోజు నుంచి లక్షతో పాటి తులం బంగారం కూడా ఇస్తానని ఆడబిడ్డలను నమ్మబలికి నేడు అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయకపోగా..ఇప్పటికే అమలులో ఉన్న పథకాన్ని ప్రశ్నార్థకంగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామాల్లో ఆడబిడ్డలు కాంగ్రెస్ నాయకులను నిలదీస్తుంటే ఏం చెయ్యాలో తెలియని పరిస్థితుల్లో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని.తులం బంగారం భారం నుంచి తప్పించుకోవడం కోసమే ఈ పథకాన్ని నిలిపివేయడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్ లో ఉన్న అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఆలస్యం లేకుండా ఆర్థిక సహాయం విడుదల చెయ్యడంతో పాటు.హైకోర్టు కేసులో ప్రభుత్వం తీసుకున్న చర్యలపై స్పష్టత ఇవ్వాలని.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తులం బంగారం హామీని ఎప్పుడు,ఎలా అమలు చేస్తుందో స్పష్టమైన ప్రకటన చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దొడ్డ రమేష్,మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు గాజుబోయిన యేసు బాబు,రావుల శ్రీనివాసరావు, తుమ్మల లక్ష్మనరావు,యార్లగడ్డ శ్రీనివాసరావు,దేవరలపల్లి అజయ్ కుమార్,జలగం వాసు,చీకటి రామయ్య, గుత్తి శ్రీను,అబ్దుల్ జిన్నా, సర్పంచ్లు యాట్ల రాందాస్,కొమరం సుశీల,ఉప సర్పంచ్ రామకృష్ణ,వార్డ్ మెంబర్లు దారా రాము,రూప రాంబాబు,ఉయ్యాల లక్ష్మీనారాయణ, వెలుగోటి మహేష్,కాసిని శ్రీను,మద్దెల పుల్లారావు,పాశం ప్రసాద్,వల్లేపు నాగేశ్వరరావు,గుడిపూడి రవి, గొర్రెపాటి వెంకటేశ్వరరావు,కౌలురి నాగయ్య,గుమ్మడపు విష్ణు,మండవ సత్య,తోలెం మల్లేష్,కోర్స వెంకటేష్,వాసం పండు,కౌలురి ఏసు,కందుకూరి రాంబాబు,గణేష్,అశోక్ తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను పరిష్కరించాలి



**: అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్**

**భద్రాద్రి న్యూస్ ములుగు**

ప్రజావాణి కార్యక్రమంలో అర్జిదారులు సమర్పించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 28 దరఖాస్తులు అందగా, వాటిలో భూ సమస్యలకు సంబంధించి 03, ఇందిరమ్మ ఇండ్లకు 05, పెన్షన్లకు 07, ఇతర శాఖలకు సంబంధించినవి 13 దరఖాస్తులు ఉన్నాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తుకు అధికారులు ప్రాధాన్యతనిస్తూ, నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సేవలకు ప్రశంసలు

**మాజీ ఆదర్శ రైతు వందవాసు రామవరప్రసాద్ ధ్వర్యంలో సన్మానం**

భద్రాద్రి న్యూస్ :దుమ్ముగూడెంహొ మండలం కొత్త దంతెనం గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావును మాజీ ఆదర్శ రైతు వందవాసు రామవరప్రసాద్ శాలువాతో ఘనంగా సత్కరించారు.

**సంక్షేమం, అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి**

ఈ సందర్భంగా రామవరప్రసాద్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. ఎమ్మెల్యేకు భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, మాజీ జెడ్పీటీసీ అన్నే సత్యాలు, స్థానిక సర్పంచ్ పోడియం సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, హౌసింగ్ ఏఈ, జేఈలు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శులు మోతుకూరి శ్రీకాంత్, కనుకు ముత్తయ్య, యూత్ అధ్యక్షురాలు బుర్రి లావణ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మట్టా శివాజీ, కెల్లా శేఖర్, తోటపల్లి సుధాకర్, పాయం వెంకటేశ్వర్లు, వీరమాచినేని సునీల్, బొల్లి శేఖర్, కొండపల్లి నరేంద్ర, ఆల వెంకటకృష్ణ, రాంపూడి అనిల్, వందవాసు రామవరప్రసాద్, కొత్త అచ్చుతరావు, కనుకు గోపాలకృష్ణ, పీటా పూర్ణయ్య, జెట్టీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# పేదింటి పెళ్లిళ్లకు ప్రభుత్వ సహాయం ఎక్కడ?





**కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులు వెంటనే విడుదల చేయాలి**

**హైకోర్టు స్టేను తొలగించాలి.. పెండింగ్ దరఖాస్తులకు న్యాయం చేయాలి**

**బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంప రాంబాబు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన.. ఎంఆర్ఓకు మెమోరాండం**

**వెంకటాపురం భద్రాద్రి న్యూస్:**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేస్తూ ప్రభుత్వ తీరును నిరసించారు. అనంతరం మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ)కు మెమోరాండం అందజేశారు.కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ఉన్న హైకోర్టు స్టేను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 1.5 లక్షల దరఖాస్తులకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేసి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచే సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని నాయకులు అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాలకు లభించే ఆర్థిక సాయం సకాలంలో అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ శ్రేణులు హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిడెం రవికుమార్, వేల్పూరి లక్ష్మీనారాయణ, మంచర్ల నాగేశ్వరరావు, బట్ట నాగేందర్, గడ్డం వివేక్, పొనగంటి కృష్ణారావు, యూత్ నాయకులు నాని, రాజేష్, శాంతమూర్తి, బేగ సంబశివరావు, సర్పంచ్‌లు ఆదిలక్ష్మి, రమ్య,ఓంపతితో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీతలకు తుడుందెబ్బ ఘన సన్మానం..

**అధికారుల ప్రతిభకు ఘనమైన గుర్తింపు**

**ఉత్తమ ఎంపీడీఓ, ఉత్తమ AERO అవార్డులు చర్లకు గర్వకారణం: తుడుందెబ్బ నాయకులు**





**చర్ల, ఆగస్టు 17 (భద్రాద్రి న్యూస్):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న చర్ల ఎంపీడీఓను, ఉత్తమ ాాజు=ాగా అవార్డు అందుకున్న చర్ల తహసీల్దార్‌ను తుడుందెబ్బ బృందం ఘనంగా సన్మానించింది. సోమవారం చర్ల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు వాసం ముసలయ్య మాట్లాడుతూ.. చర్ల మండలంలో విధులు నిర్వహిస్తూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకోవడం మండల ప్రజలకు గర్వకారణమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నారు.
అదేవిధంగా చర్ల తహసీల్దార్ ఉత్తమ ాాజు=ాగా అవార్డు అందుకోవడం కూడా మండలానికి గర్వకారణమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందించడంతో పాటు విధుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.
అవార్డులు కేవలం వ్యక్తిగత గుర్తింపు మాత్రమే కాకుండా.. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులకు ప్రోత్సాహాన్ని ఇస్తాయని తుడుందెబ్బ నాయకులు పేర్కొన్నారు. ఉత్తమ అవార్డులు అందుకున్న ఎంపీడీఓ, తహసీల్దార్‌కు తుడుందెబ్బ తరఫున ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, సీనియర్ నాయకులు తాటి వెంకటరావు, మండల యువ నాయకులు పూనెం రవికిరణ్, పురిటి ప్రశాంత్, ఇర్ప అరుణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు పనులు నాసిరకం

**సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్ అయిన రాజీవ్ లింక్ కెనాల్ పనుల్లో బయటపడ్డ డొల్లతనం**

**చిన్న వరదకె కొట్టుకుపోయిన సైడ్ సిసి వాల్ లు,**

**కాంట్రాక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధి పై స్థానికుల ఆగ్రహం**





**జూలూరుపాడు ,భద్రాద్రి న్యూస్ ప్రతినిధి:**
సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయాలనే ప్రభుత్వాల ఆశలు అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు కలిసి అడిఆశలుగా చేస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి యాస నరేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంని వినోభానగర్ వద్ద సీతారామ ప్రాజెక్టు నుండి రాజీవ్ లింక్ కెనాల్ పేరుతో సుమారు 100 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ కెనాల్ సీతారామ ప్రాజెక్టు నుంచి వచ్చే గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు తరలించేలా నిర్మాణం చేపట్టారని సుమారు 9 కిలోమీటర్ల మేర ఉన్న ఈ లింక్ కెనాల్‌ను సీతారామ ప్రాజెక్టుతో అనుసంధానం చేశారని అయితే ప్రస్తుతం కెనాల్‌లో నీటి ప్రవాహం కొనసాగుతున్న సమయంలో సిమెంటింగ్ పనులు దెబ్బతినడం, రక్షణ గోడలకు పగుళ్లు రావడం, కొన్ని ప్రాంతాల్లో నిర్మానం కొట్టుకుపోవడం వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయని అన్నారు నీటి ప్రవాహం కారణంగా కెనాల్ గట్టు కోతకు గురవుతున్న పరిస్థితి కనిపిస్తుండటంతో.. ఇంత భారీ మొత్తంలో ప్రజాధనం వెచ్చించి నిర్మించిన కెనాల్ నిర్మాణ నాణ్యతపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. చిన్నపాటి నీటి ప్రవాహానికే పరిస్థితి ఇలా ఉంటే.. భారీ వరద వస్తే కెనాల్ పరిస్థితి ఏంటి? అంటూ ఆయన ప్రశ్నించారు అదేవిధంగా మరోవైపు రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌తో పాటు సాగర్ ఆయకట్టులోని సుమారు 1.25 లక్షల ఎకరాలకు గోదావరి జలాలను అందించాలనే లక్ష్యంతో ఈ అనుసంధానం చేపట్టారని అలాంటి కీలకమైన కాలువ నిర్మాణంలో నాణ్యతపై ఆరోపణలు రావడం ఇప్పుడు చర్చనీయాంశం గా మారిందని అన్నారు స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఎందుకు కాంట్రాక్టర్ పై అమిత ప్రేమ చుయిస్తున్నాడో అర్థం కావటం లేదని అన్నారు సదరు కాంట్రాక్టర్ ఏ పనిచేసిన అందులో ఏమాత్రం నాణ్యత ఉండదని అన్నారు, అలాంటి వారు పనిచేస్తుంటే అధికారులు కానీ, ప్రజాప్రతినిధి కానీ ఆ పనులను పరిశీలించి ప్రజాధనం వృధా కాకుండా చూడాల్సిన భాధ్యత ఉండాలి కదా అని నరేష్ ప్రశ్నించారు. కెనాల్ నిర్మాణ పనులను ఇప్పటికైనా ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి.. నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేయాలని ఆయన కోరారు.



# సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టే ప్రయత్నం

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**సంక్షేమ పథకాల నిర్వీర్యానికి కాంగ్రెస్ కుట్రలు**




**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 17 (భద్రాద్రిన్యూస్ ):-**
సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న ఉదాసీనతకు నిదర్శనమని ఆయన అన్నారు. “ఆడబిడ్డ భారం కాదు.. భరోసా” అనే భావనకు గత కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూపం ఇచ్చిందని అన్నారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహం ఆర్థిక భారంగా మారకుండా అండగా నిలిచిన ఈ పథకాలను నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేసినా లేదా రద్దు చేసే ప్రయత్నాలు చేస్తే తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని పువ్వాడ హెచ్చరించారు. కల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని హైకోర్టు నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# అక్రమ వేటగాళ్లను కఠినంగా శిక్షించాలి

**నవీన్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 17 (భద్రాద్రిన్యూస్ ):-**

జంతువులను వేటాడటానికి అక్రమంగా వేటగాళ్లు విద్యుత్తు ఉచ్చులకు జంతువులతో పాటు సాధారణ మనుషులు ఫారెస్ట్ అధికారులు బలి అవుతున్నారు. వారి ఆగడాలకు అంతులేకుండా పోయింది. దీనిలో భాగంగా ఇటీవల కారేపల్లి మండలం గిద్దవారిగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బానోతు దేవ్లా నాయక్ కుమారుడు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ నాయక్ కర్తవ్య నిర్వహణలో భాగంగా ఫారెస్ట్ లో అక్రమంగా వేసిన విద్యుత్ తీగల కు తగిలి దుర్మరణం చెందారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, పిఎసిఎస్ అధ్యక్షులు, పుచ్చకాయల వీరభద్రం ధనియాకుల హనుమంతరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబ్రు నాయక్ తదితరులు వారి కుటుంబాన్ని పరామర్శించి నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి అక్రమ వేటగాళ్లను, ఎంతటి వారైనా ఉపేక్షించకుండా భవిష్యత్తులో ఇలాంటి అధికారులను పోగొట్టుకోకుండా ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కుటుంబానికి మేము వెన్నుదన్నుగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అడ్డగోడ ఐలయ్య, ముత్యాల సత్యనారాయణ ఉన్నం వీరేందర్ రావూరి శ్రీనివాస్, ఏపూరి మల్లికార్జున్ డేగల ఉపేందర్ లక్ష్మణ్, గ్రామాల సర్పంచులు మాజీ ఎంపీటీసీ లు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో రూ.11.50 కోట్లతో అభివృద్ధి పనులు

**విద్య, వైద్యం, అభివృద్ధికి కేరాఫ్ జారే ఆదినారాయణ : ఎంపీ రఘురామిరెడ్డి**





చంద్రుగొండ, ఆగస్టు 17 (భద్రాద్రి న్యూస్ ):- అశ్వరావుపేట నియోజకవర్గంలో రూ.11.50 కోట్ల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సోమవారం ఎంపీ రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శ్రీకారం చుట్టారు. చంద్రుగొండ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీ రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణను అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వద్ద నుంచి నిధులు సమీకరించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ సీసీ రోడ్లు, పాఠశాలలకు ప్రహరీ గోడలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపీ నిధులను సైతం నియోజకవర్గ అభివృద్ధికి కేటాయిస్తూ, ప్రజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని పేర్కొన్నారు.

**చంద్రుగొండ మండలంలో రూ.2.23 కోట్ల పనులు**

చంద్రుగొండ మండలంలో రూ.2 కోట్ల 23 లక్షల 50 వేల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎంపీ, ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మండలంలోని కరిసెలబోడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. వంకనంబరు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బాల్యతండలో పాఠశాల ప్రహరీ గోడను, రావికంపాడు, తిప్పనపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. మహమ్మద్‌నగర్‌లో నూతన అంగన్‌వాడీ భవనం, ప్రహరీ గోడను, వంటిగుడిసెలో ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన హ్యాండ్‌పంప్‌ను ప్రారంభించారు. సీతాయిగూడెంలో మెరుగైన రవాణా సౌకర్యం కోసం బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగ కాంగ్రెస్ పార్టీ దిమ్మ వద్ద పార్టీ జెండాను ఎగరవేసి నెలలో ప్రతి చివరి శనివారం గ్రామాలలో కావలసిన మెరుగైన పది రూపాయల కోసం సమావేశాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జారే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆత్మ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యా నాయక్, తుమ్మ రాంబాబు, గుగులోతు బాబు, తుమ్మలపల్లి సురేష్, సర్పంచులు గుగులోతు బాబు, మాలోతు గోపాల్, కె.వి.ఆర్., ఇస్లావత్ రుక్మిణి, భూక్య సరిత, పద్మ, ధరావత్ రామారావు, బొర్రా సురేష్, కాశీ విశ్వనాథ్, భద్రయ్య, బోయిన భోగి కోటేశ్వరరావు, గుగులోతు రాములు, ప్రసాద్, కృష్ణవేణి, సారేపల్లి శేఖర్,ఇమ్రాన్, నిమ్మగడ్డ శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసుల గ్యాస్ సిలిండర్లలో నీళ్లా?





**పెద్దమీడిసేలేరు గ్యాస్ డీలర్‌పై తీవ్ర ఆరోపణలు.. సమగ్ర విచారణకు డిమాండ్**

**ఆరోపణలు నిజమైతే డీలర్‌షిప్ రద్దు చేయాలి: ఆదివాసీ ప్రజలు**

**చర్ల, ఆగస్టు 17 (భద్రాద్రి న్యూస్):**

ఆదివాసీ ప్రజలకు సరఫరా అవుతున్న గ్యాస్ సిలిండర్ల విషయంలో పెద్దమీడిసేలేరు గ్యాస్ డీలర్‌పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్యాస్ సిలిండర్లలో గ్యాస్‌కు బదులుగా నీళ్లు నింపి సరఫరా చేస్తున్నారంటూ కొంతమంది ఆదివాసీ వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు తీవ్రంగా పరిగణించి సంబంధిత అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గుతేల్చాలని ఆదివాసీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**గ్యాస్ బదులు నీళ్లా?.. అధికారుల తనిఖీలెక్కడ?**

సిలిండర్లలో గ్యాస్ పరిమాణం, సిలిండర్ బరువు, సరఫరా విధానం, వినియోగదారులకు అందుతున్న సిలిండర్ల వివరాలు తదితర అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోతే అనుమానాలు మరింత బలపడే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

**సిలిండర్లు పరీక్షిస్తే అసలు నిజం బయటపడేనా?**

గ్యాస్ డీలర్‌పై వస్తున్న ఆరోపణలపై పౌరసరఫరాల శాఖ అధికారులు వెంటనే స్పందించాలని ఆదివాసీ ప్రజలు కోరుతున్నారు. అనుమానిత సిలిండర్లను పరిశీలించి, నిపుణుల సమక్షంలో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా బాధిత వినియోగదారుల నుంచి వాంగ్మూలాలు సేకరించడంతో పాటు డీలర్‌కు సంబంధించిన సరఫరా రికార్డులు, స్టాక్ వివరాలు, బరువు కొలతలు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరుతున్నారు.

**ఆదివాసీలను మోసం చేస్తున్నారా?**

ఆదివాసీ ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు నిజమైతే అది అత్యంత తీవ్రమైన విషయమని స్థానికులు అంటున్నారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో అక్రమాలు జరిగితే వినియోగదారుల భద్రతకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నందున అధికారులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని కోరుతున్నారు.

**ఆరోపణలు నిజమైతే డీలర్‌షిప్ రద్దు చేయాలి**

సమగ్ర విచారణలో ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత గ్యాస్ డీలర్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు డీలర్‌షిప్‌ను రద్దు చేయాలని ఆదివాసీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధిత వినియోగదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

గ్యాస్ సిలిండర్ల వ్యవహారంలో వస్తున్న ఆరోపణలపై అధికారులు మౌనం వీడి పారదర్శకంగా విచారణ చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లి“ఆదివాసీలకు అందుతున్న సిలిండర్లలో అసలు ఏం జరుగుతోంది?”లి అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాలని, విచారణ నివేదికను ప్రజల ముందుంచి నిజానిజాలను స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరాలి

**ఆదివాసీ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి: రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఎర్రయ్య**

**వనవాసీ విద్యార్థి నిలయానికి క్వింటా బియ్యం, ఒకపూట భోజనం వితరణ**





**చర్ల, ఆగస్టు 17 (భద్రాద్రి న్యూస్):**
విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ పట్టుదలతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని కెనరా బ్యాంక్ విశ్రాంత మేనేజర్ కుర్సం ఎర్రయ్య అన్నారు. ఆదివాసీ విద్యార్థుల అభ్యున్నతి కోసం చర్లలో నిర్వహిస్తున్న కొమరం భీం విద్యార్థి నిలయానికి క్వింటా బియ్యంతో పాటు విద్యార్థులకు ఒకపూట భోజనాన్ని వితరణగా అందించారు.
చర్ల ఆయిల్ బంక్ ప్రాంతానికి చెందిన విశ్రాంత విలేజ్ డెవలప్‌మెంట్ అధికారి, కీర్తిశేషులు సోయం భద్రయ్య జ్ఞాపకార్థం ఆయన మనుమడు, ఖమ్మంలోని పంజాబ్ సింధ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కుర్సం రవితేజ ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.
నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవితేజ తండ్రి కుర్సం ఎర్రయ్య మాట్లాడుతూ.. మారుమూల అటవీ ప్రాంత గ్రామాలకు చెందిన ఆదివాసీ విద్యార్థులకు వసతి కల్పిస్తూ వారికి విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం నేర్పిస్తున్న కొమరం భీం విద్యార్థి నిలయ సేవలు అభినందనీయమన్నారు.
విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతున్న తీరు, సంస్కృత శ్లోకాలను చక్కగా పాడుతున్న విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభ్యున్నతి కోసం నిలయ కమిటీ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని, ఇక్కడి పిల్లలను తమ సొంత పిల్లలుగా భావిస్తూ సేవలందించడం సంతోషకరమన్నారు.
విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. పట్టుదలతో చదివి తల్లిదండ్రులతో పాటు నిలయానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. "మనిషి తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు" అని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు.
ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటీడీఏ రిటైర్డ్ అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి, భద్రయ్య కుటుంబ సభ్యులు తెల్లం రమణయ్య, చింత మంగారావు, సోడి సుబ్బారావు, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం మణికుమార్, కొమరం భీం, శబరి నిలయ ప్రముఖులు సంతోష్, వరలక్ష్మి, తోలెం రామకృష్ణ, కూడం ఉంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లుతో నిరుపేదల సొంతింటి కల సాకారం

**ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**







**భద్రాద్రి న్యూస్ । దుమ్ముగూడెం**
దుమ్ముగూడెం మండలం కొత్తదంతెనం గ్రామంలో వార్డు మెంబర్ మోతుకూరి లక్ష్మీదుర్గ--నరేష్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరై, లబ్ధిదారులను అభినందించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కల నెరవేరుతోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా, గిరిజన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు అదనంగా మరో 1,500 ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ఎమ్మెల్యే నూతన వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, మాజీ జడ్పీటీసీ అన్నే సత్యాలు, స్థానిక సర్పంచ్ పొడియం సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, హౌసింగ్ ఏఈ, జేఈలు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శులు మోతుకూరి శ్రీకాంత్, కనుకు ముత్తయ్య, యూత్ ఉపాధ్యక్షురాలు బుర్రి లావణ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మట్టా శివాజీ, కెల్లా శేఖర్, తోటమళ్ల సుధాకర్, పాయం వెంకటేశ్వర్లు, వీరమాచినేని సునీల్, బొల్లి శేఖర్, కొండపల్లి నరేంద్ర, ఆలా వెంకటకృష్ణ, రాయపూడి అనిల్, వందవాసు రాము వరప్రసాద్, కొత్త అచ్చుతారావు, కనుకు గోపాలకృష్ణ, పిట్టా పూర్ణయ్య, జెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బండి కుమార్ కు వందేభారత్ అవార్డు ప్రదానం..

**-సంచలనాత్మక కథనాలకు కేరాఫ్..**
**-నాడు డాక్టరేట్, నంది అవార్డు.. నేడు వందే భారత్ అవార్డు..**
**-వెల్లు వెత్తుతున్న అభినందనలు..**






**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 17 (భద్రాద్రిన్యూస్ ):**
ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ కు అరుదైన గౌరవం దక్కింది. శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలోని పైడి జయరాజు ప్రివ్యూ థియేటర్ 2వ అంతస్తులో వారు నిర్వహించిన వందేభారత్ జాతీయ అవార్డుల ప్రదానం కార్యక్రమంలో భాగంగా పత్రికా రంగంలో సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ కి వందేభారత్ జాతీయ అవార్డును అందజేశారు. ప్రముఖ సినీ గేయ రచయిత జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, వంశీ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు, ప్రముఖ సినీ నటులు పోలాప్రగడ జనార్దన్ రావు (జెన్నీ), కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, రాజ్ ఎంటర్ ట్రైనర్స్, సీఈఓ మునుకోటి డేవిడ్ రాజ్, వందేభారత్ మూవీ డైరెక్టర్ ఆనందలహరి సంస్థ కన్వీనర్ కళారత్న మల్లం రమేష్ చే ఈ అవార్డును ప్రధానం చేశారు. అనంతరం అవార్డు గ్రహీత సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ మాట్లాడుతూ... తాను రాసిన వార్తలను, సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినందుకు వందేభారత్ జాతీయ సమైక్యత వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా డిసిసిబి డైరెక్టర్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అనుచరుడు తుళ్లూరి బ్రహ్మయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నేత బొర్రా రాజశేఖర్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగడ్ల హనుమంత రావు, ఖమ్మం నియోజవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, రఘునాధపాలెం మండల అధ్యక్షులు కేళోతు దేవ్ సింగ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పరికపల్లి శ్రీనివాస్ గౌడ్, కోసూరి శ్రీనివాసరావు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, నేలకొండపల్లి మండల ఇంచార్జి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నేత కమతం రామకృష్ణ, ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గొట్టం ఆదర్శ్, తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమళ్ళ సత్యం, తెలంగాణ ఎరుకల సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ రవి, మానవ హక్కుల ప్రజా పరిరక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల రామారావు, జర్నలిస్టు నాగార్జున, అధికారులు, జర్నలిస్ట్ మిత్రులు, ప్రజా సంఘాలు సన్మానించి, సత్కరించి, అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఈ నెల 19న జాబ్ మేళా నిర్వహణ

**జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి**

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు -17 (భద్రాద్రిన్యూస్ ):-**
ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా , ఇండస్ఇండ్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఖమ్మం కీర్తన గోల్డ్ లోన్స్ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించుటకు ఆగస్టు 19న బుధవారం ఉదయం 10.00 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్ కు ఎదురుగా ఉన్న టీటీడీసీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఎన్. మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ అడ్వైజర్ (50) ఉద్యోగాలకు ఎస్సెస్సి, ఇంటర్, ఏదేని డిగ్రీ అర్హత గల 18-40 మధ్య వయస్సు గలవారు, ఇండస్ఇండ్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (20) ఉద్యోగాలకు ఏదేని డిగ్రీ అర్హత గల 18-30 వయస్సు గల మహిళా అభ్యర్థులు, ఖమ్మం కీర్తన గోల్డ్ లోన్స్ కంపెనీ లో లోన్ ఆఫీసర్, రిలేషన్షిప్ ఆఫీసర్ (25) ఉద్యోగాలకు ఏదేని డిగ్రీ అర్హత గల 18-30 వయస్సు గల వారు అర్హులని తెలిపారు.
ఎంపికైన వారికి వేతనం 10 వేల నుండి 50 వేల వరకు ఉంటుందని తెలిపారు. మొత్తం 95 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి అర్హత గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు హెచ్ ఆర్ సెల్ నెంబర్ 8143420505, 9618890879, 8106790700 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై కాంగ్రెస్ కుట్రను ఖండిస్తూ ఆర్డీఓ కార్యాలయం ముట్టడి




**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 17( భద్రాద్రిన్యూస్ ):**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన మేరకు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశాలతో ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ ఖమ్మం ఆర్డీఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహానికి మేనమామగా అండగా నిలిచేలా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేశారని తెలిపారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన ఈ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు.

“అమలు చేయలేని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తులం బంగారం పేరుతో ప్రజలను మోసం చేసింది. నేడు పేదలు కేసీఆర్ హయాంలో అందించిన చెక్కుల కోసం ఎదురుచూస్తున్నారు. మీరు హామీ ఇచ్చిన తులం బంగారం ఎక్కడ?” అని ప్రశ్నించారు.

కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తే, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో పువ్వాడ అజయ్ కుమార్ గారు గడపగడపకు వెళ్లి కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ కిట్‌ను నిలిపివేసినట్లే, ఇప్పుడు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కూడా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

ప్రజల సంక్షేమ పథకాలను కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని బచ్చు విజయ్ కుమార్ స్పష్టం చేశారు. పేదల సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేసే ప్రయత్నాలను ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పగడాల నాగరాజు, కూరాకుల నాగభూషణం, కర్నాటి కృష్ణ, కూరాకుల వలరాజు, నాగండ్ల కోటి, పసుమర్తి రామ్మోహన్, పల్ల రోజలీనా, బీరెడ్డి నాగచంద్ర రెడ్డి, జ్యోతిరెడ్డి, సకీనా, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నారికి ‘జస్విక శ్రీ’ అని నామకరణం చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 17( భద్రాద్రిన్యూస్ ):**



ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన కాంపాటి రాకేష్, మాధవి దంపతులకు 2026 మే 9న ఆడబిడ్డ జన్మించింది. జన్మించిన 12 రోజుల అనంతరం చిన్నారి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. చిన్నారి వైద్య చికిత్సకు పెద్ద మొత్తంలో ఖర్చు అవసరం కావడంతో ఆ కుటుంబం ఆందోళనకు గురైంది.

ఈ విషయాన్ని ఖమ్మం నగరపాలక సంస్థలో శానిటేషన్ విధులు నిర్వహిస్తున్న చిన్నారి నానమ్మ నరసమ్మ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి తీసుకువచ్చారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న కమిషనర్ వెంటనే స్పందించి, హృదయ స్వచ్ఛంద సంస్థతో పాటు ప్రభుత్వ సహకారంతో చిన్నారి గుండె శస్త్రచికిత్సకు అవసరమైన రూ.14 లక్షల ఆర్థిక సహాయం మంజూరయ్యేలా కృషి చేశారు.

ఈ సహాయంతో జూలై 28న చిన్నారికి గుండె శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించగా, ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా కోలుకుంది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు తమ కుమార్తెను మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి తీసుకువచ్చి, గ్రీవెన్స్ కార్యక్రమంలో తమకు అందించిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారికి మున్సిపల్ కమిషనర్ గారు పేరు పెట్టాలని కుటుంబ సభ్యులు కోరగా, కమిషనర్ అభిషేక్ అగస్త్య సంతోషం వ్యక్తం చేస్తూ చిన్నారికి ‘జస్విక శ్రీ’ అని నామకరణం చేశారు. చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో, సంతోషంగా ఎదగాలని కమిషనర్ ఆకాంక్షించారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి సకాలంలో స్పందించి వైద్య సహాయం అందేలా కృషి చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్యకు చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు- 17 (భద్రాద్రిన్యూస్ ):-**

ప్రజావాణిలో తమ సమస్యలు తెలుపుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.

రఘునాథపాలెం మండలం పాపటపల్లి గ్రామానికి చెందిన చౌడవరపు దుర్గమ్మ తన కుమారుడు తనను అనేక బాధలు పెడుతున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

కల్లూరు మండలం ఓబులరావు బంజర గ్రామానికి చెందిన భూక్యా మురళీ తాను శారీరకంగా దివ్యాంగుడినని తాను డిగ్రీ బీకాం కంప్యూటర్ చదివానని తనకు ఏదైనా ప్రభుత్వ శాఖలో ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొణిజర్ల మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన రైతులు సర్వేనెంబర్ 19 లో తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వ్యవసాయం సాగు చేసుకుంటున్నామని, సర్వే నెంబర్ 19 అటవీ భూమికి సరిహద్దున ఉన్నందున పట్టా పాస్ పుస్తకాలు రాలేదని, 1950 మ్యాపు ప్రకారం తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమకు నాలుగు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఎస్ ఈ మిషన్ భగీరథకు రాస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా, సాగునీరు, ఖరీఫ్ పంటల నమోదుపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసిన మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి**

**సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 17 (భద్రాద్రిన్యూస్ ):-**

వైరా నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న యూరియా సరఫరా, సాగునీరు, ఖరీఫ్ పంటల నమోదు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

జిల్లాను యూనిట్‌గా తీసుకొని ఖీఖీ యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేయడం వల్ల రైతులకు దూరప్రాంత డీలర్ల వద్ద బుకింగ్ రావడం, స్థానికంగా స్టాక్ అందుబాటులో లేకపోవడం, సర్వర్--ఓటీపీ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. జిల్లా యూనిట్‌కు బదులుగా మండలం లేదా సమీప మండలాల సమూహాన్ని యూనిట్‌గా తీసుకొని యూరియా పంపిణీ చేయాలని కోరారు. వైరా నియోజకవర్గంలోని మండలాలకు అవసరమైన యూరియాను కేటాయించి బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచాలన్నారు.

రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండే పని వేళల్లో యాప్ బుకింగ్ తెరిచి ఉంచి, వారి ద్వారా రైతులకు సహాయక బుకింగ్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సర్వర్ లేదా ఓటీపీ సమస్యలు ఎదురైనప్పుడు ప్రత్యామ్నాయ బుకింగ్‌కు అవకాశం కల్పించాలని కోరారు.

వైరా కాలువ ద్వారా టెయిల్‌ఎండ్ గ్రామాల వరకు సాగునీరు చేరేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నీటిపారుదల, వ్యవసాయ శాఖ అధికారులతో సంయుక్త పరిశీలన నిర్వహించి, గ్రామాల వారీగా నీటి విడుదల--రొటేషన్ షెడ్యూల్ ప్రకటించాలన్నారు. కాలువల్లో అడ్డంకులు, అక్రమ నీటి మళ్లింపులను తొలగించి, రైతుల పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా, ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదుపై అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి, ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి రైతుల పంటలను వెంటనే నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క రైతు కూడా పంట నమోదు నుంచి మినహాయింపునకు గురికాకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నిర్ణీత గడువులో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. రైతులు పండించిన పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందస్తుగానే అవసరమైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, తూకం, రవాణా సదుపాయాలు కల్పించడంతోపాటు రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డా. చంద్రావతి విజ్ఞప్తి చేశారు.

ఈ వినతులపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, రైతుల సమస్యలను శ్రద్ధగా విన్నారు. యూరియా సరఫరా, వైరా కాలువ సాగునీరు, ఖరీఫ్ పంటల నమోదు మరియు పంటల కొనుగోలు ఏర్పాట్లపై వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ సానుకూల స్పందనకు డా. బానోత్ చంద్రావతి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ-2026లో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

**109-ములుగు నియోజకవర్గంలో 2,09,128 మంది ఓటర్లు**
**సెప్టెంబర్ 16 వరకు దావాలు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం**
**ఫారం-6, 7, 8 ద్వారా దరఖాస్తులకు అవకాశం**
**బీఎల్ఓలతో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు సమర్పించవచ్చు**
**ప్రతి ఓటరూ జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలి : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు**

**భద్రాద్రి న్యూస్ ములుగు**

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం--2026లో భాగంగా 109-ములుగు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం ప్రచురించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

109-ములుగు నియోజకవర్గ పరిధిలోని 308 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 2,09,128 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో 1,01,964 మంది పురుష ఓటర్లు, 1,07,143 మంది మహిళా ఓటర్లు, 21 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారని వెల్లడించారు.

ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రతి ఓటరూ తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. అర్హత కలిగిన పౌరుల పేరు ముసాయిదా జాబితాలో లేకపోయినా, ఇప్పటికే నమోదైన ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులు, మార్పులు ఉన్నా నిర్ణీత గడువులోగా సంబంధిత దావాలు, అభ్యంతరాలు సమర్పించవచ్చని తెలిపారు.

ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫారం-6, నమోదుపై అభ్యంతరం లేదా పేరు తొలగింపునకు ఫారం-7, ఓటరు వివరాల్లో సవరణలు చేసుకోవడానికి లేదా నివాసం మారిన సందర్భంలో నమోదు మార్పు కోసం ఫారం-8ను ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఓటర్లు తమ దావాలు, అభ్యంతరాలను నేరుగా తమ పరిధిలోని బిఖాత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)లకు సమర్పించవచ్చని తెలిపారు. అదేవిధంగా ఈసీఐనెట్ యాప్ లేదా ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా కూడా సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు.

ఆఫ్‌లైన్‌లో దావాలు, అభ్యంతరాలను ములుగు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, 109-ములుగు నియోజకవర్గ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, అన్ని పోలింగ్ కేంద్రాలలో సమర్పించవచ్చని తెలిపారు. దావాలు, అభ్యంతరాల సమర్పణకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, ఓటర్ల వివరాలు ఖచ్చితంగా, పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా



ఎన్నికల అధికారి తెలిపారు. 109-ములుగు నియోజకవర్గ ప్రజలందరూ ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి తమ పేరు, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని, అవసరమైన సందర్భంలో సెప్టెంబర్ 16వ తేదీలోగా ఫారం-6, ఫారం-7 లేదా ఫారం-8 ద్వారా దావాలు, అభ్యంతరాలు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు కోరారు.

## యస్.బి.ఐ.టి లో ఘనంగా ఓరియన్‌టేషన్ ప్రోగ్రాం



**ఆలోచింపచేసిన గరికపాటి సలహాలు సూచనలు**
**అజ్ఞానాన్ని పారద్రోలే ఏకైక ఆయుధం విద్య - గరికపాటి**
**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 17 (భద్రాద్రిన్యూస్ ):-**

గురువులను, తల్లిదండ్రులను గౌరవించటం విద్యార్థులు అలవరుచకోవాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహాసహస్ర అవధాని గరికపాటి నరసింహారావు తెలిపారు. సోమవారం స్థానిక యస్.బి.ఐ.టి. కళాశాలలో నిర్వహించిన మొదటి సంవత్సర విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న గరికపాటి తల్లిదండ్రులు మరియు గురువుల ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులు ఫోన్లు, టెలివిజన్ వంటి వ్యాపకాలు మాని వారంలో 2 రోజులు డిజిటల్ ఉపవాసం అలవర్చుకోవడం ద్వారా విద్యపై దృష్టిని కేంద్రీకరించగలమని వెల్లడించారు. మోయలేని భారం వల్లనే ఒత్తిడి పెరుగుతుందన్నారు. గురువులతో చర్చించడంతో ఎలాంటి ఒత్తిడినైనా జయించవచ్చని వారు తెలిపారు. విద్యను అభ్యసిస్తూనే దేశ అభివృద్ధి గురించి ఆలోచించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గరికపాటి విద్యార్థులతో ముఖాముఖి చర్చించి వారితో ప్రశ్నోత్తరాలలో పాల్గొన్నారు.

కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ యస్.బి.ఐ.టి. లో ఉన్నత మైన విద్యా ప్రమాణాలు పాటించటంతో పాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించటంలో నిర్విరామంగా కృషి చేస్తున్నామని, కళాశాల పొందిన న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ మరియు యు.జి.సి అటానమస్ హోదా దీనికి నిదర్శనం అని, ఈ విద్యా సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 100 శాతం అడ్మిషన్లు కలిగిన కళాశాలగా నిలవటం ఎంతో గర్వనీయమని ఇది మా కళాశాలపై భాధ్యతను పెంచిందని, తల్లిదండ్రుల నమ్మకానికి అనుగుణంగా విద్యార్థులు అభివృద్ధి చేందేందుకు తాము సాయశక్తుల కృషి చేస్తామని వెల్లడించారు.

మన దేశంలో ఏటా 15 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేస్తుండగా కేవలం 1.5 లక్షల మంది మాత్రమే ఉద్యోగాలు పొందుతున్నారని మిగిలిన వారు నిరుద్యోగులుగా




మిగిలిపోతున్నారని, ఈ పరిణామాలకు అనుగుణంగా మా విద్యార్థులకు కోడింగ్, రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ మొదలగు శిక్షణా కార్యక్రమాలను, ఇంటర్న్‌షిప్స్, ఫస్ట్ ఇయర్ నుంచే నిర్వహిస్తున్నామని తద్వార బహుళజాతి కంపెనీలలో అత్యధిక ప్లేస్‌మెంట్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి విశ్లేషించారు.

విలువలతో కలిగిన విద్యనందించటంలో తమ కళాశాల అహర్నిసలు కృషి చేస్తుందని కళాశాల వైస్- ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. విద్యార్థులు పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక విప్లవమైన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్ మొదలగు రంగాలలో ఆసక్తిని పెంచుకొని నైపుణ్యాలను పెంచుకోవటంలో ధృడ సంకల్పం కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి. రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రుల తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, హెచ్.ఒ.డిలు, డా॥ కె. అమిత్ భిందాజ్, డా॥ టి. చరణ్ సింగ్, డా॥ కె. స్ఫూర్తి, డా॥ యమ్. సుప్రియ మీనన్, డా॥ యమ్. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోని ప్రఖ్యాత యూనివర్సిటీలలో సీట్లు సాధించిన హార్వెస్ట్ విద్యార్థులు



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 17 (భద్రాద్రిన్యూస్ ):-**

హార్వెస్ట్ కళాశాలలో సి.బి.ఎస్.ఈ. ఆర్ట్స్ & కామర్స్ విభాగంలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను 100% ఫలితాలను సాధించడమేకాక దేశంలోని ప్రఖ్యాత సెంట్రల్ యూనివర్సిటీలలో అండర్ గ్రాడ్యుయేషన్ మరియు లా సీట్లు సాధించడం జరిగిందని హార్వెస్ట్ కళాశాల యాజమాన్యం నేడు తెలియజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు అధికశాతం విద్యార్థినీ, విద్యార్థులు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా స్థిరపడాలనే ఆలోచనతో సైన్స్ స్ట్రీమ్ కోర్సులవైపు మొగ్గు చూపుతున్న నేటి తరుణంలో అందుకు ప్రత్యామ్నాయంగా హార్వెస్ట్ విద్యాసంస్థలు ప్రత్యేక ప్రణాళికతో సెంట్రల్ సిలబస్లో ఆర్ట్స్ గ్రూపులలోని విద్యార్థులను దేశం గర్వించదగ్గ యూనివర్సిటీలలో సీట్లు సాధించడం వెనుక నిరంతర కృషి, అధ్యాపకుల శిక్షణతోపాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం నేటి ఈ ఫలితాలకు కారణమని తెలియజేస్తూ అభ్యార్థుల వివరాలను తెలియజేశారు.

దేశంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థ అయిన ఐ.ఐ.ఎం బెంగళూరులో ఆశ్రిత సత్యం అడ్మిషన్ సాధందించగా, గీతాకృష్ణ ఆల్ ఇండియా క్లాట్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి వైజాగ్లో దామోదరయ్య సంజీవయ్య లా యూనివర్సిటీలో అడ్మిషన్ సాధించడం జరిగింది. అలాగే ఎన్. యశస్విని, ఎస్. మధుసంసిత మరియు నోయల్ లు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, సుజనా గౌతమి మరియు ఈషాన్ లు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ, శ్రీన్యా మరియు నేహనాగ్ ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ, సాత్విక అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ, సుకుమార్ మరియు జాస్మిన్ లు తెలంగాణ రాష్ట్ర లా ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించి కాకతీయ యూనివర్సిటీ మరియు ఉస్మానియా యూనివర్సిటీలో సీట్లు సాధించడం గర్వకారణమన్నారు.

## కుర్సం కృష్ణ మృతదేహం లభ్యం

**చంద్రుగొండ/జూలూరుపా(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి బలరాం :**

:మండలంలోని మద్దుకూరు గ్రామ శివారులో సీతారామ ప్రాజెక్టు కాలువలో పడి కుర్సం కృష్ణ(45సం) అనే వ్యక్తి ఆదివారం గల్లుతు అయిన సంగతి తెలిసిందే అయితే సోమవారం బెండలపాడు గ్రామ సమీపంలోని సీతారామ కాలువలో మృతదేహం కనిపించింది వెంటనే చంద్రుగొండ పోలీసులకి సరమాచారం అందదం తో పోలీసులు కేసు , నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.